క్లుప్తంగా

వరద బాధితులకు రూ.5 లక్షల సాయం

ఆదోని అర్బన్: స్థానిక శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ రాయచోటి రామయ్య బ్యాంకు తరపున గురువారం వరద బాధితుల సాయం నిమిత్తం రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్‌టీజీఎస్ ద్వారా పంపినట్లు బ్యాంకు సీఈఓ మురళీకుమార్ తెలిపారు. బ్యాంకు సిబ్బంది కూడా ఒక్కరోజు జీతం రూ.40,378 విరాళంగా ప్రకటించారని చెప్పారు.

పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సయ్యద్‌చాంద్‌ను గురువారం రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం, చికిత్స తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీలర్ ఖాజ, రఫి, కుమార్, ఫయాజ్, షరీఫ్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డులో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం అర్ధరాత్రి ధాన్యలక్ష్మీ ట్రేడింగ్ షాపులో చోరీ జరిగింది. గురువారం ఉదయం యజమానికి శ్రీనివాసులు షాప్‌కు వచ్చి చూడగా షట్టర్ ఓపెన్ చేసి ఉంది. షాపులోని బీరువాలో ఉంచిన రూ.30 వేల నగదును దుండగులు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. మార్కెట్ యార్డు సెక్రటరీకి విషయం తెలియజేసినట్లు బాధితుడు తెలిపారు. ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

వాహనాల తనిఖీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం రోడ్డులోని జైన్ దేవాలయం వద్ద గురువారం పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్ లేని వాహనాలను గుర్తించి రూ.3,500 జరిమానా విధించినట్లు ఎస్ఐ చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని వేర్వేరు ప్రాంతాల్లో అరెస్టు చేశామని మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. గురువారం మంత్రాలయం మండలంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా సూగూరు గ్రామ క్రాస్ రోడ్డు మంత్రాలయంకు చెందిన పెద్ద మల్లేష్ 96 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లును బైక్‌పై తీసుకొస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వగరూరు గ్రామానికి చెందిన కురువ నరసన్న నుంచి 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైక్‌ను, మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గ పరిధిలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆర్థికంగా నష్టపోయిన రైతులు, ఇళ్లల్లో వరదనీరు చేరి తిండిగింజలు, వస్తువులు తడిచిపోయిన శరణార్థుల కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 08512255468ను సంప్రదించాలని, వెంటనే ఆదుకుంటామని చెప్పారు.

ధరలు నియంత్రించాలి

గోనెగండ్ల: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఐ సీనియర్ నాయకుడు మద్దిలేటి నాయుడు, మండల కార్యదర్శి నాగప్ప, సహాయ కార్యదర్శి పూజారి మునిస్వామి, రైతు సంఘం నాయకుడు మాలిక్‌లు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు ధర్నా నిర్వహించి జూనియర్ అసిస్టెంట్ దినేష్‌కు వినతిపత్రం అందజేశారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఫాతెహాల్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాల్ సమర్పించారు.

రోడ్డును బాగుచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక గోనెగండ్ల బైపాస్ వద్ద కర్నూలు ప్రధాన రహదారి వర్షపు నీటితో చెరువును తలపిస్తోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాకులు అన్నారు. వారు గురువారం రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీటిలో నిరసన వ్యక్తం చేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రోడ్డును బాగు చేయాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు రామలింగ, అనీల్, ప్రతాప్‌బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ముగతి మోడల్ స్కూల్‌లో...


గోనెగండ్లలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



పెద్దకడబూరులో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలల్లో పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి హాజరయ్యారు. సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వేపల్లి చేసిన సేవలను ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమములో ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● సెయింట్ అంథోని పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మండల విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డేవిడ్‌తోపాటు ఎంఈఓను సన్మానించారు.

● పట్టణంలోని ఆర్‌ఆర్ లెబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం రమేష్ నాయుడు, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● మిల్టన్ గ్రామర్ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రవచనకర్త సుస్వరం నాగరాజ్ సర్వేపల్లి సేవలను గుర్తు చేశారు.

ఆదోని అర్బన్: ఆదోని లయన్స్ క్లబ్, ఆవోపా, వామ్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను స్థానిక ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. అదేవిధంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు శకుంతల, బ్రహ్మయ్య, శివరామ రెడ్డిని సత్కరించారు.

పెద్దకడబూరు : మండలంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం పెద్దకడబూరు ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి హెచ్‌ఎం ఉమారాజేశ్వరి, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఒకరికొకరు శుభకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

కౌతాళం: మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా స్కూళ్లలో డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం గురురాజశెట్టి, కౌతాళం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఎరిగేరి జెడ్పీస్కూల్ హెచ్‌ఎం రమేష్ నాయుడు సర్వేపల్లి సేవలను కొనియడారు.

కోసిగి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మౌంట్ కార్మెల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఫాదర్ జిజో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పతనంపై మాట్లాడారు. అలాగే ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా ఆధ్వర్యంలో టీచర్స్ డే నిర్వహిచంఆరు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈఓలు మధుసూదన్‌రాజు, ఆంజినేయులు, ఏజీఎం రమేష్‌కుమార్, ఏఓ జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగలదిన్నె, పూలచింత, మాచాపురం ఎంపీపీ పాఠశాలల్లో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. కనకవీడు ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠాలు బోధించారు.

గోనెగండ్ల: దేశ అభివృద్ధిలో గురువు పాత్ర ఎంతో కీలకమైనదని ఎంఈఓ నీలకంఠ అన్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్ర పటాలకు పూలవేసి నివాళులర్పించారు.


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు


కౌతాళం జూనియర్ కళాశాలలో...


కోసిగిలో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


టీచర్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ఎమ్మిగనూరురూరల్: ఆన్‌లైన్ మోసాలు, పోక్సో యాక్టు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆయన గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తాలుకా స్థాయి పోలీస్, అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. అవగాహన లోపంతో బాలికలు మోసగాళ్ల వలలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వాటిని నివారించేలా బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజెప్పాలని సూచించారు. అలాగే పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల భోజన పథకంలో మెనూ, నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడాలన్నారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓలను ఆదేశించారు. తహసీల్దార్ శేషఫణి, ఆర్‌అండ్‌బీ డీఈఈ నాగరాజు, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీఓ బంగారమ్మ, ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస ఆచారి, పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి, కర్నూల్ రేంజ్ ఫారెస్ట్ అధికారిణి తేజశ్విని, సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎంఈఓ ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు కేసుల వివరాలు తెలియచేస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసఆచారి

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి


మాట్లాడుతున్న ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమసింహా

నందవరం: వినాయకచవితి పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమసింహా సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా గ్రామ పెద్దలతో గణేశ్ ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవాలని, ఉత్సవాలకు సంబంధించి విగ్రహ ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యత కమిటీ సభ్యులదేనన్నారు. మూడు రోజులలో ఉత్సవాలను పూర్తి చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు పంచాయతీ, విద్యుత్ శాఖ అనుమతులు, డీజేలు, మైకులకు పోలీసుల అనుమతి ఉండాలన్నారు. రోడ్లు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 19వ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు, విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంతో పాటు విద్యాబోధనను పరిశీలించారు. కొన్ని లోపాలను గుర్తించి వర్కర్‌కు మెమో ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు.


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి

వినాయక విగ్రహాల పంపిణీ

ఆదోని టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా 600 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రజలకు మట్టి విగ్రహాలను రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. అనంతరం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కార్యాలయంలో కలిసి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఆదోని డీఎస్పీ సోమన్నకు మట్టి విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో వినాయక విగ్రహాల పంపిణీ ప్రాజెక్టు ఇన్‌చార్జ్‌లు రఘునాథ్‌రెడ్డి, ఇతేశ్, రోటరీ క్లబ్ సభ్యులు జీవన్‌సింగ్, సునీల్‌రెడ్డి, భరత్‌షా, ప్రశాంత్‌గాంధీ, విట్టా మురళీధర శ్రీధర్‌రెడ్డి, రాయచోటి సుబ్బయ్య, పద్మనాభయ్యశెట్టి, వీరేష్‌స్వామి, సోమశేఖరెడ్డి, విజయ్‌కుమార్, విట్టా రాజేష్, షణ్ముఖ, శివరామ్, హుసేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు మట్టి విగ్రహాన్ని అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మెడికల్ కాలేజీ పనులు ఆపొద్దు

ఎమ్మిగనూరుటౌన్: ఆదోనిలో మెడికల్ కళాశాల పనులను నిలిపివేసే యోచనను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని సీపీఎం నాయకుడు గోవిందు, సీఐటీయూ నాయకుడు రాముడు, డీవైఎఫ్ఐ నాయకుడు సురేష్, రైతు సంఘ నాయకుడు లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల పనులు నిలిపివేసేందుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మెమోను ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ శ్రీదేవికి ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్న యోచనతో గత ప్రభుత్వం మెడికల్ కళాశాలను నిర్మించతలపెడితే ప్రస్తుత ప్రభుత్వం పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. ఏపీ ఎంఎస్ఐడీసీ కర్నూలు ఎస్ఈ ఈనెల 3వ తేదీన నిర్మాణ పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కు మెమో ఇచ్చారని, దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులు రమేష్, మోహిన్, మహేష్, కృష్ణ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

ఆదోని రూరల్: మండలంలోని బలదూర్ గ్రామంలో గురువారం పొలం విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కట్టెలు, రాళ్లతో కొట్టుకోవడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయని ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఇస్వీ ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధుసుభాని ఫిర్యాదు మేరకు ఇబ్రహీం, మహబూబ్‌బాషా, జిలానీ, చాంద్‌బాషాలపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే గౌసియా ఫిర్యాదు మేరకు ఆసీఫ్, హనీఫ్, మహబూబ్‌బాషా, చాంద్‌బాషాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గాయాలైన వ్యక్తులను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

బాధితులను ఆదుకోవాలి


ఆర్ఐ మహేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్(అఖిల భారత రైతు కూలీ సంఘం) జిల్లా ప్రధానకార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ మహేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వలను రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పంటనష్ట బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. మండలంలో నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.25వేల రూపాల చొప్పున పంటనష్ట పరిహారాన్ని అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు హనుమంతు, నాయకులు నాగేంద్ర, రామాంజి, బాబు, వీరయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య

గోనెగండ్ల: దళిత, గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆయన మండలంలోని కులుమాల గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కులుమాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు బుజ్జిబాబు, సూరి, రత్నమయ్య, చిన్న హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.